సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 9 । నవంబర్ । 2023



బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం

కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలో కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు.

II లో



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనుల వైకుంఠంగా సాగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి జనం పోటెత్తుతున్నారు.

II లో

5,500 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు వెయ్యి, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమడెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఏఆర్ ఏఎస్పీగా చెంచిరెడ్డి



ఎస్పీ జగదీష్‌ను కలసిన ఏఆర్ ఏఎస్పీ చెంచిరెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ఏఆర్ విభాగం ఏఎస్పీగా ఎల్.చెంచిరెడ్డి నియమితులయ్యారు. పోలీసు జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ అదనపు ఎస్పీల బదిలీల్లో భాగంగా విజయవాడ ఏఆర్ విభాగంలో సిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్పీ పి.జగదీష్‌ను కలిశారు.

నేడు వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని వెంకటాయపాలెం(గోపాలపురం), బొమ్మూరు -4 (రాజమహేంద్రవరం రూరల్), దివాన్‌చెరువు-2 (రాజానగరం) గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్ డా.కె.మాధవీలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లోక్‌అదాలత్ ద్వారా రాజీపడదగిన కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఆమె ఆధ్వర్యంలో అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ, జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, చార్జిషీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా చూడాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, ఏఎస్పీ ఎం.రజని పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా అలీబేగ్



మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన మహమ్మద్ అలీబేగ్ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా ఎంపికయ్యారు. ఆయనకు బుధవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి సమాచారం వచ్చింది. విజయవాడలో ఈ నెల 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవ సభలో అవార్డును అందజేస్తారు. ఆయన ప్రస్తుతం కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు.

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..



- 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో సరికొత్త కార్యక్రమం
- నేటి నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ
- ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో..
- ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించే ప్రయత్నం
- 24 పేజీల బుక్‌లెట్ రూపకల్పన
- టీడీపీ, జనసేన, ఇతర పార్టీల బురద రాజకీయాలకు సమాధానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెంపొందించే క్రమంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అర్హత ఉండి లబ్ధి పొందని వారిని గుర్తించి మరీ లబ్ధి చేకూరుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు నేరుగా ఇళ్ల వద్దకే చేరుస్తోంది. ఇందుకుగాను ఏటా రూ.వేల కోట్ల నిధులు (డీబీటీ, నాన్ డీబీటీ) వెచ్చిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి ఆస్పత్రి, పాఠశాల, కళాశాల అంగన్‌వాడీ తదితర ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు, మరమ్మతు పనులు చేపడుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తోంది. పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తోంది. 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులను ప్రతి గ్రామానికి స్వయంగా పంపుతోంది. అక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం చూపుతోంది.

టీడీపీ, జనసేన విమర్శలను తిప్పి కొట్టేందుకు..

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష టీడీపీ, జనసేన ఇతర పార్టీలు బురదజల్లుతున్నాయి. కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతున్నా కళ్లుండీ చూడలేని కబోదుల్లా టీడీపీ జనసేన నేతలు వ్యవహరిస్తున్నారు. ప్రతి కుటుంబం ఏడాదికి రూ.లక్షకు పైనే లబ్ధి పొందుతున్నా ఏం ఇవ్వలేదన్న ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవమానించడమే పనిగా పెట్టుకుని అర్థం లేని విమర్శలు గుప్పిస్తున్నారు. టీడీపీ, జనసేన విమర్శలు, ఆరోపణలను తిప్పి కొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఇందుకుగాను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు సన్నద్ధమవుతోంది. ఏ గ్రామానికి ఏ స్థాయిలో మేలు జరిగింది? ప్రజలకు వివరించి ప్రతిపక్ష పార్టీల బురద రాజకీయాలకు దీటైన సమాధానం ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

నేటి నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ

ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించేందుకు 'వై ఏపీ నీడ్స్ జగన్' (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..) పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను రూపొందించారు. గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించేలా కార్యాచరణ రూపుదిద్దుకుంది. ప్రతి మండలంలో ప్రతిరోజూ ఒక గ్రామ సచివాలయంలో నిర్వహిస్తారు. అర్బన్ ఏరియాలో సైతం ఒక వార్డు సచివాలయంలో జరుగుతుంది. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుంది.

కార్యక్రమ షెడ్యూల్

జిల్లా వ్యాప్తంగా 240 గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇలా..

తేదీ	సచివాలయాలు సంఖ్య	తేదీ	సచివాలయాలు సంఖ్య
9	23	17	24
10	24	20	24
14	24	21	24
15	24	22	24
16	24	23	25

ప్రజల ముందుకు తీసుకెళ్లే అంశాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఏ విధమైన మేలు జరిగింది? గ్రామాభివృద్ధికి దోహదం చేసిన అంశాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తారు.

- గ్రామాల వారీగా ప్రజలకు నేరుగా ఎంత మొత్తం అందించారు. ఎంతమంది లబ్ధి పొందారు? ఏయే పథకాలకు అర్హత సాధించారో వెల్లడిస్తారు.
- ఎంత మంచి జరిగింది, ఎన్ని రకాల పథకాలు అమలవుతున్నాయో చెబుతారు.
- ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి అందించేలా చర్యలు తీసుకుంటారు.
- 'నాడు–నేడు' ద్వారా వచ్చిన మార్పులు స్పష్టం చేస్తారు.
- ఇంగ్లిషు మీడియం, స్కూళ్లలో 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానల్స్, 8వ తరగతిలో ట్యాబుల పంపిణీ వరకూ మారుతున్న స్కూళ్ల వ్యవస్థపై అవగాహన కల్పిస్తారు.
- విలేజ్ క్లినిక్స్, ఆర్బీకే లాంటి వ్యవస్థలతో వైద్య, వ్యవసాయ రంగాల్లో వచ్చిన మార్పులను వివరిస్తారు.
- పథకాల అమలులో పారదర్శకత, సోషల్ ఆడిట్‌తో నాణ్యమైన సేవలు, దిశ యాప్ ద్వారా అందుతున్న లాభాన్ని వెల్లడిస్తారు.
- ప్రభుత్వ పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆర్థిక పురోగతి గతంలో, ఇప్పుడు ఎలా ఉంది? డీబీటీ, నాన్ డీబీటీపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.
- పథకాల్లో లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన బోర్డులు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పెడుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తాం



ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతాం. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక ఇప్పటికే రూపొందించాం. కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగుల స్థాయి వరకు ఉద్యోగులను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నాం. నిర్వహణపై సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాం. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో కార్యక్రమం జరుగుతుంది. ప్రజలకు ఎంత మేలు జరిగింది, ఏ మేరకు నిధులు నేరుగా, వివిధ పథకాల ద్వారా అందించాం. ఆ గ్రామ అభివృద్ధిపై విపులంగా వివరించనున్నాం.

– కె.మాధవీలత, కలెక్టర్

పర్యవేక్షణ అధికారుల నియామకం

కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించారు. కలెక్టర్ నుంచి క్షేత్ర స్థాయి అధికారుల వరకు పాల్గొంటారు. జిల్లా నోడల్ ఆఫీసర్‌గా సీపీఓ (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్) వ్యవహరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈఓపీఆర్డీలు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ అధికారి, పట్టణ ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్ నోడల్ ఆఫీసర్‌గా ఉంటారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది భాగస్వాములవుతారు.

వలంటీర్ల పాత్ర

ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాన్ని అభిమానించే వారి వద్దకు వెళ్లి జరిగిన మంచిని గ్రామ, వార్డు వలంటీర్లు సమయం చూసుకుని వివరిస్తారు. గతానికి భిన్నంగా పరిస్థితులు ఎలా మెరుగుపడ్డాయి, ఎంత మంచి జరిగింది అన్నదాన్ని ప్రతి ఇంటికీ తీసుకుని వెళ్తారు.

ప్రజాహితంగా సీఎం జగన్ పాలన

- అందుకే జగనన్న మళ్లీ సీఎం కావాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పక్కన రవీంద్ర, గూడూరి శ్రీనివాస్

రాజానగరం: ప్రజాహితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీ పీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై దివాన్‌చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగున్నరేళ్ల పాటు అందించిన పాలన, గతంలో చంద్రబాబు సాగించిన పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏవిధంగానైనా అధికారంలోకి రావాలనే దుర్బుద్ధితో 2014 ఎన్నికల్లో చంద్రబాబు 650 హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని ఏవిధంగా నీరుగార్చాడో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ఇలా అనేక హామీలు గాలిలో కలిపివేసిన ఘనుడు చంద్రబాబు అని అన్నారు. చివరకు తానిచ్చిన మేనిఫెస్టో కూడా ప్రజలకు కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి మాయం చేశాడన్నారు. అదే 2019 ఎన్నికల సమయంలో నవరత్నాలతో పాటు ప్రజా సంక్షేమం కోసం మరికొన్ని హామీలను కరపత్రం (మ్యానిఫెస్టో) ద్వారా ప్రజలకు తెలియజేసి, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకూ వాటిని పూర్తి స్థాయిలో అమలు చేసి, ప్రజలకు జవాబుదారీ పాలన అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

అన్యాయంగా విభజనకు గురైన రాష్ట్రంలో ఆర్థికంగా లోటు ఉండటమే కాకుండా కరోనా వైరస్ వంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ఏమాత్రం బెదరకుండా సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగించి సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు ఏ అవసరం వచ్చినా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని అన్నారు. కానీ జగనన్న పాలనలో పార్టీలు, కులాలు చూడకుండా అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చేశారని రాజా వివరించారు.

ఇంటి వద్దకే పథకాలు

గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే రాజా అన్నారు. ఈ కారణంగానే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు ముంగిటకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. అమ్మ ఒడి, కాపు నేస్తం, రైతు భరోసా, చేదోడు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలతో అందరికీ ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇంతవరకూ రూ. రెండు లక్షల 50 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ అయ్యాయన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్ర మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం పారిశ్రామికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో 13,500 చిన్నతరహా పరిశ్రమలు ఉంటే, నేడు 2.50 లక్షలకు చేరుకున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను అన్ని విధాలా అభివృద్ధిలోకి తీసుకువస్తూ, అనేక విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నారన్నారు. జగనన్నకు మరోసారి అవకాశం ఇస్తే, ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

వదంతులు నమ్మవద్దు



మధుసూదనరావు, ఆర్‌సీఆర్‌బీ, డీఈఈ

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చినట్టు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న వదంతులు నమ్మవద్దని రోడ్డు కం రైలు బ్రిడ్జి (ఆర్‌సీఆర్‌బీ) డీఈఈ బీవీ మధుసూదనరావు వెల్లడించారు. మరమ్మతుల కోసం ఈ నెల పదో తేదీ వరకు అనుమతి తీసుకున్నామని, వాహనాల రావడం మూలంగా బ్రిడ్జిపై తాము చేపట్టే పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో మేసేజ్‌లు ట్రోల్ చేస్తున్న కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మాత్రమే బ్రిడ్జిపై వాహనాలను అనుమతించనున్నట్లు ఆయన ప్రకటించారు. బ్రిడ్జిపైకి భారీ వాహనాలు రాకుండా ఇరు వైపు గడ్డర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి రోడ్డు మార్కింగ్, ఫుట్‌పాత్‌ల పెయింట్ పనులు కొనసాగుతున్నాయన్నారు. జాయింట్ల వద్ద మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రమోదం.. కాకూడదు ప్రమాదం

- దీపావళి బాణసంచా.. తయారీ, విక్రయాలపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ప్రమాదాన్ని నివారిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): 'దీపావళి' అనగానే వెలుగు జిలుగులు, బాణసంచా హోరు, పిల్లల సందడితో ప్రతీ ఇల్లు కళకళలాడుతుంది. అయితే ఆ ప్రమోదం వెనకే ప్రమాదం పొంచి ఉందన్న విషయం గుర్తెరగరు. బాణసంచా తయారీ నుంచి అమ్మకాలు, వినియోగం వరకూ ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా పెను ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడుతూనే వుంటాయి. గత అనుభవాలు దృష్ట్యా పోలీసు, అగ్నిమాపక యంత్రాంగం, వివిధ ప్రభుత్వ శాఖలు ముందుగానే అప్రమత్తమయ్యాయి. బాణసంచా తయారీ, అమ్మకాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కొరడా ఝుళిపించి పండగ సజావుగా జరుపుకునే వాతావరణం కల్పించేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశాయి.

ముమ్మర తనిఖీలు

జిల్లాలో ఏటా రూ.90 కోట్ల మేర బాణసంచా విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే శివకాశి, వేట్లపాలెం తదితర ప్రాంతాల నుంచి బాణసంచా జిల్లాకు చేరుకుంది. ఈ బాణసంచా విక్రయాలు హోల్‌సేల్, రిటైల్ విధానాల్లో జరుగుతాయి. పర్మినెంట్ లైసెన్సు కలిగిన దుకాణదారులు హోల్‌సేల్‌గా అమ్మకాలు చేస్తున్నారు. రిటైల్ అమ్మకం దారులు, అనధికార బాణసంచా తయారీదారుల వల్లే గతంలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీపావళి సందర్భంగా తాత్కాలిక లైసెన్సు తీసుకునే రిటైల్ వ్యాపారులు నిబంధనల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ధనార్జనకు ఆశపడి నివాస గృహాల మధ్య, కార్ఖానాల్లో ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా బాణసంచా తయారు చేస్తున్నారు. అటువంటి వారి కారణంగా భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఆయా సమయాల్లో ప్రమాదాన్ని అరికట్టేందుకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకోవడం కష్టతరం. అటువంటి సందర్భాల్లో నష్టం పెరిగి చుట్టుపక్కల వారు ప్రమాదంలో చిక్కుకున్న సందర్భాలు జిల్లాలో అనేకం ఉన్నాయి. గతంలో బాణసంచా తయారు చేసి పట్టుబడ్డ వ్యక్తులుపై ఇప్పటికే నిఘా పెట్టారు. అటువంటి వారిని బైండోవర్ చేశారు. క్షేత్రస్థాయిలో నిఘా పెంచేందుకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు గ్రామ సచివాలయ పోలీసులు, వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటున్నారు. ఇళ్ల మధ్యలో బాణసంచా నిల్వ చేసే వారి సమాచారం టోల్ ఫ్రీ నంబర్లు 100, 101కి అందించాలని పోలీసులు కోరుతున్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జిల్లాలో గతంలో భారీ ప్రమాదాలు

రాజమహేంద్రవరం మోచీ వీధిలో ఇళ్ల మధ్య ఓ భవనంలో నిల్వ చేసిన దీపావళి బాణసంచా గోడౌన్లో ప్రమాదం జరగటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి దట్టమైన పొగ అలుముకుని స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఇరుకు దారుల మధ్య అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేందుకు నానా హైరానా పడాల్సి వచ్చింది. ప్రాణ నష్టం లేకుండా మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

- రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు ప్రాంతంలో మేడ మెట్ల కింద నిల్వచేసిన బాణసంచాను అక్కడే ఆడుకుంటున్న చిన్నారులు పొరపాటున కదపడంతో జరిగిన పేలుడులో ఓ బాలుడు మృతిచెందాడు.
- లాలాచెరువు కూడలి సమీపంలో నారాయణపురంలో ఓ ఇంట్లో బాణసంచా పెద్దఎత్తున తయారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు, తయారీ పనిలో ఉన్న మరో మహిళ మృత్యువాత పడ్డారు.
- గత ఏడాది రాజమహేంద్రవరం ఆవరోడ్డు వాంబే గృహాల వద్ద జరిగిన ప్రమాదంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించి ఓ వ్యక్తి మత్యువాత పడ్డాడు. భారీ నష్టం ఏర్పడింది.
- పదేళ్ల క్రితం రాజమహేంద్రవరం దేవీచౌక్ ప్రాంతంలో ఓ ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా జరిగిన పేలుడులో భవనం ధ్వంసం అవడంతోపాటు పేలుడు ధాటికి తయారీలో ఉన్న వ్యక్తి ఎగిరి చుట్టుపక్కల ఇళ్లపై పడి మృతిచెందాడు.

గణాంకాలిలా...

- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి పొందిన 17 బాణసంచా తయారీ కేంద్రాలున్నాయి.
- వాటిలో కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలో 12, ఈస్ట్‌జోన్ పరిధిలో 4, నార్త్‌జోన్ పరిధిలో కోరుకొండలో ఒకటి మాత్రమే ఉన్నాయి.
- గత ఏడాది సంభవించిన అగ్ని ప్రమాదాల్లో 8 మంది మృతిచెందారు.
- అగ్నిమాపక శాఖ 29 మందిని రక్షించింది.
- ఐదేళ్లలో 155 అగ్ని ప్రమాదాలు సంభవించగా వాటి ద్వారా రూ.1,15,25,000 ఆస్తి నష్టం సంభవించింది.

పదేళ్ల రికార్డుల ఆధారంగా ముందుకు వెళుతున్నాం



పదేళ్లుగా జరిగిన ఘటనలను దృష్టిలోకి తీసుకుని వాటిలో అరెస్టు అయిన వ్యక్తులు, తయారీ, అమ్మకం కేంద్రాలపై దృష్టి సారించాం. అగ్నిమాపక శాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ ప్రారంభించాం. జిల్లాలోని దుకాణాలను స్వయంగా తనిఖీ చేస్తున్నాను. అందరూ లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే బాణసంచా కొనుగోలు చేయాలి. జనం దీపాలు వెలిగించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

– పి.జగదీష్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

భద్రత పాటించండి



దీపావళి ప్రతీ ఒక్కరూ ఆనందమయంగా చేసుకోవాలి. ఈ పండుగలో చిన్న పిల్లలు ఎక్కువగా పాల్గొంటారు. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలోనే వారు మందులు కాల్చాలి. ఎటువంటి అగ్నిప్రమాదాలు సంభవించినా వెంటనే 101 కు ఫోన్ చేస్తే క్షణాల్లో సంఘటనా స్థలంలో ఉండేలా ఏర్పాట్లు చేశాం. దీపావళి రోజు ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏదైనా కాల్ వస్తే సెకన్లలో కదిలే విధంగా ముందస్తుగా అగ్నిమాపక యంత్రాలతో సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. ఆ రోజు సిబ్బందికి సెలవు క్యాన్సిల్ చేశాం.

– మార్టిన్ లూథర్‌కింగ్, జిల్లా అగ్నిమాపకాధికారి

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తుని – నర్సీపట్నం మధ్యలో విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి సుమారు 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. అతడి ఒంటిపై నలుపు రంగు జీన్ ప్యాంటు, సిమెంట్ రంగు చొక్కా ఉన్నాయి. మృతుడి వివరాలేమీ తెలియలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు క్షేమంగా బాలుడు



రాజమహేంద్రవరంలో బాలుడితో పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటి నుంచి పారిపోయిన వచ్చిన ఓ బాలుడిని ప్రకాశం నగర్ పోలీసులు క్షేమంగా అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల ఏడో తేదీ రాత్రి కానిస్టేబుల్ సీహెచ్ శేషు నైట్ బీట్ గస్తీలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అయోమయంగా తిరుగుతున్న 15 ఏళ్ల బాలుడు కనిపించాడు. అనుమానంతో ఆ బాలుడిని ప్రశ్నించగా, తన పేరు దేవరకొండ సత్య విశ్వనాథ్ అని, తండ్రి వీరభద్రరావు అని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం తన స్వగ్రామమని, తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి పారిపోయి వచ్చానని చెప్పాడు. వెంటనే కానిస్టేబుల్ సీహెచ్ శేషు ఈ విషయాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృపానందానికి సమాచారం ఇచ్చారు. ఆ బాలుడిని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం వారికి బాలుడిని క్షేమంగా అప్పగించారు.

బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం



అప్పనపల్లిలో పీచుతో బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు



పీచుతో అందంగా రూపుదిద్దుకున్న బొమ్మలు



కొబ్బరి పీచుతో తయారు చేసిన దండ

- డొక్క పీచుతో అందమైన బొమ్మలు
- ప్రతిభ చూపుతున్న మహిళలు
- 400 మందికి శిక్షణ

మామిడికుదురు: కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలోని పలు గ్రామాల్లో బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కోనసీమలోని అప్పనపల్లి, బి.దొడ్డవరం, లూటుకుర్రు, పెదపట్నం, పెదపట్నంలంక, పాశర్లపూడి, ఈదరాడ, జనుపల్లి గ్రామాల్లో కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై పలువురు మహిళలు శిక్షణ పొందారు. బొమ్మల తయారీలో వారికి రాజమహేంద్రవరం క్వాయర్ బోర్డుతో పాటు నాబార్డు బాసటగా నిలుస్తోంది. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ నిర్వాహకుడు కటికిరెడ్డి గంగాధర్ ఈ శిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు ఇతర ఉప ఉత్పత్తుల తయారీపై 400 మంది మహిళలు శిక్షణ పొందారు. వీరు కొబ్బరి పీచుతో ఏనుగులు, తాబేళ్లు, జిరాఫీలు, లేడి, నెమలి, గుర్రం, ఒంటె, పిచ్చుక గూళ్లు, గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు. మహిళలు తయారు చేస్తున్న బొమ్మలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో క్వాయర్ బోర్డు ఆధ్వర్యాన ఎగ్జిబిషన్లలో ప్రదర్శించి, విక్రయిస్తున్నారు.

తయారీపై శిక్షణ పొందాం



మా గ్రామం నుంచి చాలా మంది మహిళలు డొక్క పీచుతో బొమ్మల తయారీపై శిక్షణ పొందారు. కోనసీమలో సులభంగా లభ్యమయ్యే డొక్క పీచుతో ఎన్నో అద్భుతమైన బొమ్మలు తయారు చేయవచ్చు. వీటితో పాటు కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీకి కూడా ఆస్కారం ఉంది. క్వాయర్ బోర్డు సహకారం అందిస్తే దీనిని కుటీర పరిశ్రమగా మరింతగా విస్తరిస్తాం.

– వానరాశి సరస్వతి, మామిడికుదురు

జీవనోపాధి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడం చాలా సులభం. బొమ్మల తయారీపై క్వాయర్ బోర్డు ఇచ్చిన శిక్షణలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పీచుతో ఎంతో అందంగా ఉండే బొమ్మలు రూపుదిద్దుకుంటున్నాయి. బొమ్మల తయారీని ప్రతి గ్రామానికీ విస్తరిస్తే మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుంది. ఈ దిశగా క్వాయర్ బోర్డు కార్యాచరణ చేపట్టాలి.

– కాకి వెంకటనాగలక్ష్మి, బి.దొడ్డవరం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడంలో ఎంతో మంది మహిళలు శిక్షణ పొందారు. కానీ మేం తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం పెద్ద సమస్యగా మారింది. క్వాయర్ బోర్డుతో పాటు ప్రభుత్వం కూడా మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల మహిళలకు మేలు జరుగుతుంది. మరింత మంది బొమ్మల తయారీకి ముందుకు వస్తారు.

– పెద్దిరెడ్డి సురేఖ, అప్పనపల్లి

నేటి నుంచి సౌత్ జోన్ కబడ్డీ టోర్నీ



సతీష్ రెడ్డి

గండేపల్లి: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కళాశాలలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్ గురువారం నుంచి ఐదు రోజుల పాటు జరగనుంది. ఈ టోర్నీని రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభిస్తారని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం గండేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆరు రాష్ట్రాల పరిధిలోని 113 వర్సిటీల నుంచి 1,200 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. ప్రారంభోత్సవానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఏపీ ఉన్నత మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ వర్సిటీ వీసీ కె.పద్మరాజు తదితరులు హాజరవుతారన్నారు.

కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా

పెదపూడి: కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరకుదురులో 2018 సంవత్సరంలో ఎం.బ్రహ్మాజీ, వైఎస్ రావు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై విచారణ అనంతరం బుధవారం కాకినాడలోని పీజేసీఐ కమ్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ వీఎల్ఎస్.సుందరి తీర్పునిచ్చారు. బ్రహ్మాజీ వర్గానికి రూ.10 వేలు, వైఎస్‌రావు వర్గానికి రూ.15 వేల జరిమానా విధించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్ -14, 17 ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ప్రారంభించారు. 60 మంది రెండు విభాగాల్లో హాజరు కాగా, 32 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాలో ఈ నెల 11, 12 తేదీలలో జరిగే అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలనికోరారు. సైక్లింగ్ ఎంపికల్లో 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని సహకారం అందించారు.

11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ బుధవారం తెలిపారు. కాకినాడ గుడారిగుంట డీమార్ట్ సమీపంలోని మున్సిపల్ టెన్నిస్ కోర్టులో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 94908 96851 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

- రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు
- ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహణ



విజేతలతో డీవైఈవో నారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో బుధవారం 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించారు. వీటిని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో తులసీ దాస్ ప్రారంభించారు. డీవైఈవో మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశమన్నారు. న్యాయనిర్ణేతలుగా వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, శ్రీనివాస్, దుర్గారావు, మల్లికార్జున, హరినాథ్ రెడ్డి, ఎం.రాజీవ్ వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు

రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల, శ్రీగౌతమీ పాఠశాల, కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూలు, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. గుంటూరులో జరిగే ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొంటారని జిల్లా ఆప్ కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కస్నూరి సతీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, అకడమిక్ కోఆర్డినేటర్ మేకా సుసత్య రేఖ, రిసోర్స్ పర్సన్స్ ఆనంద్ బాబు, సుబ్బయ్య, ఆంజనేయులు, ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ యేలేటి విజయ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి పార్థసారథి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల రామారావు (56) ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఏపీఓ రాజామణి తెలిపిన వివరాల ప్రకారం .. చాకలిపాలెం కాలువలో తూటు తొలగిస్తుండగా ఉదయం 11 గంటలకు రామారావుకు గుండెపోటు వచ్చింది. కాలువలో నుంచి గట్టు పైకి వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనపై ఉపాధి కూలీలు ఏపీఓ రాజామణికి సమాచారం అందించడంతో ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.



రామారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రాజామణి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ONE SITTING : 10th, 12th, B.A., B.Com, B.Sc., PG, B.Ed., Engineering, Pharmacy, Nursing, Agri, VET. From Recog. Universities (For Discont. /Drop out) Exam in Nov/Dec. WES / IQAS / EMBASSY Attestation will be done Cont: ✆ : 73383 76874 [R-142]

Real Estate

TO-LET

■ KAKINADA : 3 BHK (New construction, 2nd Floor) 1650 Sft. with car parking (near) karanam gari center : PH: 81211 30200 / 99515 98518 COMMERCIAL / RESIDENTIAL [R-2004]

Services

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-202]

■వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220945]

■బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6307]

BUSINESS OFFER



■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 6309563491 [H-193277]

Wanted

■ Wanted computer operator (Female) (MS office) with speed typing in English at Amalapuram area, excellent salary Contact ✆ : 95503 42233 [R-1151406]

■ హిందీ మాట్లాడగలిగి EXCEL లో అనుభవం కంప్యూటర్ ఆపరేటర్స్ & ప్లంబింగ్, ఎలక్ట్రికల్ అభ్యర్థులు కావలెను. రాజమండ్రిలో ఉద్యోగం. అనుభవాన్ని బట్టి జీతం. సంప్ర॥ 90143 66484 [R-4911]

■ రాజమండ్రి క్రైస్తవ చిల్డ్రన్ హాస్టల్‌లో స్త్రీ వార్డెన్స్ కావలెను. Q: Inter / Degree. మంచి జీతం. రూమ్ + ఫుడ్. ఇ.నెం. 107, మున్సిపల్ కాలనీ. సెల్ : 99494 52245 [R-6290]

■ రాజమండ్రి నందు పార్ట్ టైం English Translator కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ 89195 49175 [R-6291]

■ ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కం॥ల్లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (స్త్రీలు మాత్రమే) కావలెను. డిగ్రీ, 1 సం॥ Exp. జీతం : 12,000 to 15,000 + ఇన్‌సెంటివ్. ✆ : 99851 59888 [R-138]

■ అగస్త్య ఇంటీరియర్స్ నల్లజర్ల మా సంస్థకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.అర్హత: 10 th పైన మంచి ఆదాయం. సంప్రదించండి: 99630 00587, 96666 59734 [P-779359]

■ Work from home Telecallers Female for Car Loans, Salary+ Incentives, Rajamundry Location, Cell: 9030100111. [T-4700]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073 [HA-794]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221866]

■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F/ Caretakers కావలెను. 16-20 వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు కలవు. 6300813664 [G-1182]

■ రెయిన్‌బో కంపెనీలో బుక్స్ మార్కెటింగ్ చేయుటకు కావలెను 10th ఇంటర్ పాస్/ఫెయిల్ కమీషన్ ఇవ్వబడును. 2 వీలర్ కంపల్ సరీ Ph: 9398981980 [H-793485]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221909]

■ హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు భోజనం, బస్ పాస్ ఫ్రీ జీతం రూ. 12,000 నుండి 20,000. Ph: 9676950291, 8340028105 [HA-12533]

■ కష్టతెల్సి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd.7993583999 [HA-831]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52828, 6281208656 [B-1206467]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

- వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు
- గజవాహనంపై స్వామివారి దర్శనం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పండితులు



రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై స్వామి వారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు పూజలు, సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై బీవై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తిరుప్పావడ సేవ, చూర్ణోత్సవం, ప్రధాన హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజనం, కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు జరుపుతారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం

- కర్రతో కొట్టడంతో ఎడమ కన్నుకు గాయం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



దెబ్బతిన్న మనోజ్ కుమార్ ఎడమ కన్ను

నిడదవోలు: పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో ఎడమ కన్ను దెబ్బతింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలో బుధవారం విద్యార్థి సంఘాల బంద్‌కు పిలుపునిచ్చాయి. అయితే సెయింట్ ఆన్స్ హైస్కూల్ యాజమాన్యం మాత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రైవేట్ క్లాసులు నిర్వహించింది. మండలంలోని సింగవరానికి చెందిన వీరమల్ల మనోజ్ కుమార్ ఆ క్లాసులకు హాజరయ్యాడు. అల్లరి చేస్తున్నాడనే కారణంతో అతడిని సోషల్ ఉపాధ్యాయుడు వసంత్ కుమార్ విచక్షణా రహితంగా కర్రతో కొట్టాడు. దీంతో మనోజ్ వీపుపై గాయాలు కావడంతో పాటు ఎడమ కన్ను పూర్తిగా దెబ్బతింది. తోటి విద్యార్థులు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం లయన్స్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మనోజ్ కంటి నుంచి రక్తం కారి గడ్డకట్టడంతో విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అక్కడి వైద్యులు రిఫర్ చేశారు. ఇంత జరిగినా స్కూల్ యాజమాన్యం మాత్రం పట్టించుకోలేదు. తోటి విద్యార్థుల సమాచారంతో మనోజ్ కుమార్ తల్లిదండ్రులు శివబాలకృష్ణ, శ్రీలక్ష్మి లయన్స్ కంటి ఆసుపత్రి వెళ్లారు. విద్యార్థి తండ్రి సమాచారం ఇవ్వడంతో రైటర్ చింతా రాజు తన సిబ్బందితో కంటి ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

నాలుగు గంటల్లో చైన్ స్నాచర్ అరెస్టు



చోరీ సొత్తు, నిందితుడితో టూటౌన్ సీఐ గణేష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని పారిపోయిన చైన్ స్నాచర్‌ను నాలుగు గంటల్లోనే రెండో పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఘటన జరిగిన వెంటనే టూటౌన్ సీఐ టి.గణేష్ తనదైన శైలిలో దర్యాప్తు చేసి, నేరస్తుడిని పట్టుకుని, సొత్తును మహిళకు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల ఏడో తేదీ సాయంత్రం 6 గంటలకు టి.నగర్‌లోని మరంగంటి వారి వీధికి చెందిన కీర్తిలక్ష్మి జోడుగుళ్ల వీధిలో ట్యూషన్ చెప్పి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని సుమారు 13 గ్రాముల బంగారు మంగళ సూత్రాల తాడును లాక్కుని పారిపోయాడు. కీర్తిలక్ష్మి వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంలో పడిపోయిన దొంగ సెల్‌ఫోన్‌ను గుర్తించారు. అలాగే సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. నిందితుడు తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని కామధేను నగర్‌కు చెందిన ఇవటూరి వరప్రసాద్‌గా గుర్తించారు. రాత్రి 10.30 గంటల సమయంలో అతడిని స్వగ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. మహిళ మెడలోంచి లాక్కున్న మంగళసూత్రం తాడుతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన రెండో పట్టణ సీఐ గణేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణ, హెచ్‌సీలు సీహెచ్.శ్రీనివాసరావు, ఎస్.రాజశేఖర్, పీసీలు కె.ప్రదీప్ కుమార్, వీరబాబు, బీఎస్‌కే నాయక్, ఎస్‌కే.కరీం బాషాలను ఎస్పీ పి.జగదీష్, సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు అభినందించారు.